ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
5
ఆదివారం 9 మార్చి 2025

భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 34.0
కనిష్ఠం : 22.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:19 (ఆది)
సహరి : 4:54 (సోమ)

మహిళా లోకానికి అండగా..



భీమవరంలో 2కే వాక్ ర్యాలీలో పాల్గొన్న మహిళలు



పింక్ బెలూన్లు ఎగుర వేస్తున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామ, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారా యణ, కలెక్టర్ నాగరాణి, ఎస్పీ నయీం అస్మి తదితరులు

భీమవరంలో ఉత్సాహంగా సాగిన 2కే వాక్ ర్యాలీ

భీమవరంటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : భారత దేశంలో మహిళలకు ఉన్న గౌరవం ప్రపంచంలో ఏ దేశంలో లేదని, ప్రధాని మోదీ చట్టసభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ఆలోచన చేయడం శుభపరిణామని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రకాశం చౌక్ నుంచి 600 మంది మహిళలతో ఏర్పాటు చేసిన 2కే వాక్ ర్యాలీని డిప్యూటీ స్పీకర్ కనుమూరి రఘురామకృష్ణరాజు, జిల్లా కలెక్టరు చదలవాడ నాగరాణి, జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తితో కలిసి ఆయన గులాబి రంగు బెలూన్లను గాలిలోకి వదిలి ప్రారంభించారు. ఈ ర్యాలీ మహిళలు ప్లకార్డులతో అల్లూరి సీతారామరాజు స్మృతి వనంకు చేరుకుంది. కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ మాట్లాడుతూ ఎక్కడ మహిళలు గౌరవించబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారని మన భారతీయుల ప్రగాఢ విశ్వాసం అన్నారు. డిప్యూటీ స్పీకర్ రఘురామ మాట్లాడుతూ సృష్టికి మూలం స్త్రీ అని, స్త్రీ లేకపోతే సృష్టి లేదన్నారు. కలెక్టరు నాగరాణి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలోని మహిళలు సముద్ర కెరటంలా తరలివచ్చి విజయవంతం చేయడం శుభ పరిణామం అన్నారు. ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రతి కుటుంబంలో ఈరోజు పండుగ రోజు అన్నారు. ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర్లు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

జిల్లావ్యాప్తంగా మహిళా దినోత్సవ సంబరాలు

కాస్మోపాలిటిన్ క్లబ్ ఆడిటోరియంలో..

భీమవరం కాస్మోపాలిటిన్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ నాగరాణి పాల్గొన్నారు. రాష్ట్ర ఏపీ ఏఎస్‌సీపీసీ చైర్మన్ పీతల సుజాత, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ప్రజా పద్దుల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు, ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుణకుమారి, ట్రైనీ డీఎస్పీ కె.మానస మాట్లాడారు. పలు ప్రభుత్వ శాఖలలో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థలు, సోషల్ వర్కర్స్‌కు సంబంధించిన 70 మందిని సత్కరించి, మెమొంటోలు అందించారు. విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



భీమవరంలో సాంస్కృతిక ప్రదర్శన



కాస్మోపాలిటిన్ క్లబ్ ఆడిటోరియంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

రిజిస్ట్రేషన్లు ఢమాల్



నరసాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

తేరుకోని శాఖ.. ఆదాయం అంతంత మాత్రమే

రిజిస్ట్రేషన్ శాఖ ఆదాయం భారీగా పడిపోయింది. లక్ష్యాలను చేరుకోవడం గగనమైంది. ఐదేళ్లుగా ఎదుర్కొంటున్న గడ్డు పరిస్థితులే నేడూ కొనసాగుతున్నాయి. ప్రభుత్వం మారినా ఆదాయంలో మార్పు రావడం లేదు. మార్చి మాసాంతంలోగా నూరు శాతం టార్గెట్ పూర్తి చేయాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారు. ఇప్పటికే లక్ష్యాలను చేరుకోలేక సతమతం అవుతున్న జిల్లా అధికారులకు ఈ కొత్త తలనొప్పులు వస్తున్నాయి.

- జిల్లా లక్ష్యానికి అందనంత దూరం
- ఇప్పటి వరకు 64.28 శాతమే ఆదాయం
- మార్చి మాసాంతానికి వంద శాతం లక్ష్యం పూర్తి కావాలని ఉన్నతాధికారుల ఆదేశం

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రిజిస్ట్రేషన్ల శాఖ ఆదాయం పడిపోవడానికి కారణాలు అనేకం. ఆస్తులను కొనుగోలు చేసేందుకు జనాలు ఆసక్తి చూపడం లేదు. స్థిరాస్తి అంటే గతంలో ఇంటి స్థలమో.. వ్యవసాయ భూములో కొనుగోలు చేసేవారు. ఇప్పుడంతా బంగారం వైపు ఆసక్తి చూపుతున్నారు. బంగారమైతే సొమ్ములు ఎప్పుడు అవసరమైనా లభ్యమవుతాయి. మార్కెట్‌లో సునాయాసంగా చెల్లుబాటు అవుతుంది. బ్యాంకులు తక్కువ వడ్డీకే రుణాలు ఇస్తున్నాయి. ఫలితంగా దీనిపై పెట్టుబడులు పెట్టేవారి సంఖ్య పెరిగింది.

అదే భూమి కొనుగోలు చేస్తే సమస్యలెన్నో వస్తున్నాయి. సరిహద్దు తగాదాలు ఎక్కువయ్యాయి. గత ప్రభుత్వంలో చేపట్టిన సర్వేలో ఎన్నో సమస్యలు ఉత్పన్నమయ్యాయి. కొత్తచట్టం అంటూ హడావుడి చేశారు. యజమానులకు, రైతులకు తమ సొంత ఆస్తిపై హక్కు ఉండదన్న ఆందోళనే జనంలో ఎక్కువైంది. ఎన్నికల ముందు దీనిపైనే అంతటా చర్చ జరిగింది. రైతుల్లో కొత్త చట్ట భయం నాటుకు పోయింది. ఇంకా ఆ భయం నుంచి కోలుకోలేదు. కొనుగోలుదారులు లేకపోవడంతో భూముల ధరలు పడిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంతా కాస్త ఊపిరి పీల్చుకున్నారు. భూముల ధరలను పెంచి చెబుతున్నారు. కొనుగోలు చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. రిజిస్ట్రేషన్ లు తగ్గు ముఖం పట్టాయి. స్టాంప్ డ్యూటీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం గణనీయంగా పడిపోయింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో 64.28 శాతం మాత్రమే ఆదాయం లభించింది. మార్చి మాసాంతానికి వంద శాతానికి చేరుకోవాలి. రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు దీనిపైనే ఇప్పుడు కసరత్తు చేస్తున్నారు. సమీక్షలు నిర్వహిస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వారీగా

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం	లక్ష్యం (రూ.కోట్లలో)	ఆదాయం (రూ.కోట్లలో)
తాడేపల్లిగూడెం	81.85	45.66
అత్తిలి	22.45	11.89
ఆచంట	13.82	7.43
ఆకివీడు	25.83	11.73
భీమవరం	123.03	60.62
మొగల్తూరు	20.84	16.40
నర్సాపురం	42.20	20.19
పాలకొల్లు	54.14	31.70
పెనుగొండ	19.70	9.63
పెంటపాడు	12.12	7.33
తణుకు	64.98	34.00
ఉండి	14.16	12.92
వీరవాసరం	18.86	7.18
గునుపూడి(భీమవరం)	63.88	28.47
సజ్జాపురం	38.83	24.80

ఆదాయం అంతంతే

జిల్లాలో 15 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.616.76 కోట్లు ఆదాయం తెచ్చిపెట్టాలని ఆదేశాలు జారీచేసింది ఇప్పటి వరకు రూ.352.82 కోట్లు మాత్రమే వచ్చింది. అంటే 64.28 శాతం సాధించగలిగారు. మార్చి 31 నాటికి వంద శాతం లక్ష్యం పూర్తికావాలని అధికారులు ఒత్తిడి పెంచుతున్నారు. క్షేత్రస్థాయిలో ఆదాయం వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో రిజిస్ట్రేషన్‌ల సంఖ్య పెరుగుతుందన్న అంచనా ఉండేది. ఇప్పుడా ఆశలు కనిపించడం లేదంటూ అధికారులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు.

స్థిరాస్తులపై నమ్మకం పెరిగితేనే

ప్రజల్లో స్థిరాస్తులపై నమ్మకం పెరగాలి. ముఖ్యంగా భూములు కొనుగోలు చేస్తే భద్రమన్న భరోసా కల్పించాలి. గత ప్రభుత్వంలో అటువంటి నమ్మకం సడలిపోయింది. స్టాంప్ పేపర్లు కూడా నాణ్యత లేకుండా సరఫరా చేస్తున్నారు. ముద్రిత స్టాంప్‌లను తగ్గించేశారు. ఒక దశలో రిజిస్ట్రేషన్‌లు చేసుకున్న వారికి జిరాక్స్ దస్తావేజులు ఇస్తామని వైసీపీ ప్రభుత్వ హయాంలో అలజడి రేగింది. అసలు దస్తావేజులు ప్రభుత్వం వద్దే ఉంటాయంటూ ప్రచారం జరిగింది. మరోవైపు భూసమస్యలు ఏర్పడితే కోర్టును ఆశ్రయించకూడదు. అధికారులదే అంతిమ నిర్ణయం అంటూ చట్టం తీసుకొచ్చింది. ఇవన్నీ ప్రజల్లో ఒకరకమైన భయాన్ని పెంచాయి. భూముల కొనుగోలుపై ఎవరూ ఆసక్తి చూపలేదు. మరోవైపు ఆదాయ మార్గాలు తగ్గిపోయాయి. స్థలాలు, భూములపై పెట్టుబడి చేసే వారి సంఖ్య తగ్గింది. మళ్లీ జనంలో నమ్మకం కుదిరితే రిజిస్ట్రేషన్ శాఖలో జోష్ నెలకొంటుంది. లేదంటే ఆదాయ లక్ష్యాలను చేరుకోవడానికి తంటాలు పడాల్సి వస్తుందంటూ అధికారులు గుబులు చెందుతున్నారు.

ఆక్వాను ఆదుకోండి

ఆందోళన బాటలో రైతులు
ఆకివీడు హైవేపై ధర్నా



7

పోలీస్ సేవలు అభినందనీయం

7

బాలిక అదృశ్యం.. 12 గంటల్లో ఛేదించిన పోలీసులు



భీమవరంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

జాతీయ లోక్ అదాలత్‌లో 347 కేసుల రాజీ

భీమవరం క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు భీమవరం మండల న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఛైర్మన్, మూడో అదనపు జిల్లా జడ్జిగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ అధ్యక్షతన భీమవరం కోర్టుల ప్రాంగణంలో పెండింగ్ సివిల్, క్రిమినల్, ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేయుటకు శనివారం 'జాతీయ లోక్ అదాలత్' నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో కక్షిదారుల సౌకర్యార్థం మూడు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. మూడో అదనపు జిల్లా కోర్టు, ప్రీ లిటిగేషన్ కేసుల రాజీకి ఏర్పాటు చేసిన బెంచ్‌కు న్యాయమూర్తిగా పోక్సో కోర్టు న్యాయమూర్తి డాకర్ బి. లక్ష్మీనారాయణ, సభ్యురాలిగా న్యాయవాది కె.మాలతీ లత పాల్గొన్నారు. మూడో అదనపు జిల్లా కోర్టు మినహా అన్ని కోర్టుల సివిల్ కేసులు, ప్రిన్సిపల్ జ్యుడీషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ కోర్టు కేసుల పరిష్కారానికి ఏర్పాటు చేసిన బెంచ్‌కు న్యాయమూర్తిగా సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) ఎం.సుధారాణి, సభ్యురాలిగా జీఎస్ఎస్ పార్వతిదేవి వ్యవహరించారు. ఒకటో అదనపు, రెండో అదనపు జ్యుడీషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్ కోర్టుల క్రిమినల్ కేసులు రాజీ చేయుటకు ఏర్పాటు చేసిన బెంచ్‌కు న్యాయమూర్తిగా డి.ధనరాజు, సభ్యునిగా సంఘ సేవకులు మేళం దుర్గాప్రసాద్ పాల్గొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు 15, క్రిమినల్ కేసులు 311, మోటార్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ కేసులు 6, ప్రీలిటిగేషన్ కేసులు 15 మొత్తం 347 కేసులు రాజీ అయినాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ. 4 కోట్ల పది లక్షల రూపాయలు అన్నారు.

ఉమ్మడి పశ్చిమలో 5,368 కేసుల రాజీ

ఉమ్మడి పశ్చిమ జిల్లాలో అన్ని కోర్టులలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 5,368 కేసులను పరిష్కరించామని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఛైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం.సునీల్ కుమార్ తెలిపారు.

ఎన్టీఆర్ వైద్య సేవ ఉద్యోగులు విధుల బహిష్కరణ

10, 17, 24వ తేదీల్లో ..

భీమవరం క్రైం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో పనిచేస్తున్న ఉద్యోగులు వారి ప్రధాన సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 10, 17, 24 తేదీల్లో మూడు సోమవారాలు రాష్ట్రం మొత్తం విధులు బహిష్కరిస్తున్నామని ఏపీ వైద్య సేవ ఎంప్లాయిస్ జేఏసీ యూనియన్ నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్‌వీఎస్ పథకాన్ని బీమా పరిధిలోకి తీసుకెళ్ళేందుకు రంగం సిద్ధంచేస్తుంది. ఆప్కాస్ రద్దు దిశగా ఇప్పటికే అడుగులువేసిన ప్రభుత్వం ఏప్రిల్ నుంచి బీమా సేవలు కొనసాగుతాయని తెలిపింది. ఈ పరిణామాలతో రాష్ట్రంలో పనిచేస్తున్న ఎన్టీఆర్‌వీఎస్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలో గత 17 ఏళ్లుగా రాష్ట్ర ప్రజలకు ఉచిత సేవలందించడంలో కీలక పాత్ర పోషించిన మొత్తం ఫీల్డ్ సిబ్బంది ప్రభుత్వాల నుంచి ఎటువంటి లబ్ధి పొందలేకపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రభుత్వ లెక్కల్లో చూపించి కనీస వేతనాలు అమలు చేయకుండా అరకొర జీతాలతో సరిపెట్టేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నాయి. ప్రతి శాఖలో వేతనాలు మారుతున్నాయి. కానీ ఎన్టీఆర్‌వీఎస్ ఉద్యోగుల జీవితాలు మారడం లేదు. అధికారుల చుట్టూ ఎన్ని ప్రదక్షిణలు చేసినా మీ సమస్యలు ప్రభుత్వ చేతుల్లో ఉన్నాయంటున్నారు.కుటుంబ పోషణ భారమై తమ గోడును ప్రభుత్వానికి విన్నవించాలని జిల్లా సమన్వయకర్త అధికారి ఆఫీస్ దగ్గర కూర్చుని శాంతియుత నిరసన తెలపాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇప్పటికైనా సమస్యలు నెరవేరని పక్షంలో భవిష్యత్ పోరాటానికి సిద్ధమని స్పష్టం చేశారు.



పలు రాష్ట్రాల నుంచి వచ్చిన జైన్ భక్తులచే భారీ ఊరేగింపు



ఆచంట జైన్ మందిరంలో పూజా కార్యక్రమాలు

ఆకట్టుకున్న జైన్‌ల ఊరేగింపు

నేడు జైన్ మందిర ప్రతిష్ఠా మహోత్సవం

ఆచంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఆచంటలో నూతనంగా నిర్మించిన శ్రీరాజేంద్ర సూరీశ్వరీజీ గురు ధ్యాన జైన్ మందిరం ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమాలు శనివారం వైభవంగా జరిగాయి. పలు రాష్ట్రాల నుంచి జైన్ భక్తులు గురువులచే పలు రకాల వాయిద్యాలు, గుర్రాల వంటి వాటితో ఆచంటలోని గ్రామ పురవీధుల మీదుగా జైనుల పాటలతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం మందిరంలో పూజాధికాలు నిర్వహించారు. ఆదివారం ఉదయం జైన్ మందిరం ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం జరుగుతుందని, ఏర్పాట్లు పూర్తి చేశామని జైన్ ట్రస్టు చైర్మన్ అజిత్ కుమార్ జైన్, కమిటీ సభ్యులు తెలిపారు. ఆచంటలో ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ జైనుల రాకతో ఆచంటలో వెలుగు వచ్చిందని, జైనుల పవిత్రతను కాపాడాలని వారికి సహకారం అందించాలని సూచించారు. ఆచంట మదన గోపాలస్వామి ఆలయం వద్ద ఉన్న జైనుల 23 తీర్థంకుడు అయిన పాశ్వనాథుని విగ్రహాన్ని కూడా ప్రభుత్వం ఆదేశం, గ్రామస్థులు, అఖిల పక్షం సభ్యుల అంగీకారంతో ఆ విగ్రహం కూడా ఆదివారం జైనులకు అప్పగిస్తున్నట్లు తెలిపారు.



గుర్రపు బండిపై జైనుల ఊరేగింపు





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
నెట్‌ఫ్లిక్స్		
అమెరికన్ మ్యాన్‌హంట్	డాక్యు సిరీస్	మార్చి 10
అమెజాన్ ప్రైమ్		
వీల్ ఆఫ్ టైమ్ 3	వెబ్‌సిరీస్	మార్చి 13
బీ హ్యాపీ	హిందీ చిత్రం	మార్చి 14
జీ5		
ఇన్ గలియోంమే	హిందీ చిత్రం	మార్చి 14
ఆపిల్ టీవీ ప్లస్		
డోప్ థీఫ్	వెబ్‌సిరీస్	మార్చి 14
ఈటీవీ విన్		
పరాక్రమం	తెలుగు చిత్రం	మార్చి 13
రామం రాఘవం	తెలుగు చిత్రం	మార్చి 14
సోనీ లివ్		
ఏజెంట్	తెలుగు చిత్రం	మార్చి 14

కూతురు కోసం తండ్రి తపన

దేశంలోని అతిపెద్ద డ్యాన్స్ రియాలిటీ షోలో ప్రదర్శన ఇవ్వాలన్న కూతురి కోరికను తీర్చేందుకు ఓ తండ్రి చేసిన ప్రయత్నాల నేపథ్యంలో సాగే హిందీ చిత్రం 'బీ హ్యాపీ'. అభిషేక్‌బచ్చన్ శివ అనే అంకిత భావం గల తండ్రి పాత్రను పోషించారు. ఇనాయత్ వర్మ ఆయన కూతురు ధార పాత్రలో కనిపించనుంది. డాన్స్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కింది. తల్లి లేని లోటు తెలియకుండా అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురి కోరికను తీర్చేందుకు తపించే తండ్రి పాత్రలో అభిషేక్ నటన ఈ సినిమాకు ప్రధానాకర్షణ అని ట్రైలర్‌ను బట్టి



తెలుస్తోంది. తండ్రీ, కూతురు కలసి ముంబై వెళ్లడం, అక్కడ డ్యాన్స్ షోలో పాల్గొనేందుకు వారు చేసే ప్రయత్నాల్లోంచి పుట్టే వినోదం అలరిస్తుంది. ఈ చిత్రానికి రెమో డిసౌజా దర్శకత్వం వహించగా, సల్మాన్‌ఖాన్, ఇమ్రాన్ మజూర్ నిర్మించారు.

వేసవిలో పిల్లలకు ఇవి తినిపించాలి..!

వేసవికాలంలో పిల్లలకు బలవర్థకమైన పోషకాహారం అత్యవసరం. పెరుగుతున్న ఎండవేడిని తట్టుకునేలా సమయానుసారం పిల్లలకు ఎలాంటి ఆహారం పెట్టాలో తెలుసుకుందాం.

- ఎండ వేడిమి వల్ల పిల్లల శరీరంలో నిర్జలీకరణ స్థితి ఏర్పడి వడదెబ్బ తగిలే అవకాశం ఉంటుంది. దీన్ని నివారించేందుకు తరచూ పిల్లల చేత చల్లని నీరు తాగిస్తూ ఉండాలి. ఫ్రిజ్ కంటే కుండలోని నీళ్ల ఆరోగ్యానికి మంచివి.
- మధ్యాహ్న సమయంలో పలుచని మజ్జిగ, కొబ్బరి నీళ్ల, పండ్ల రసాలు, నిమ్మరసం, రాగి జావ, బార్లీ నీళ్ల తాగించాలి. కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్‌ల జోలికి వెళ్లనీయకూడదు.
- సబ్జా గింజలు లేదా చియా గింజలను నీళ్లలో నానబెట్టి వాటిని పండ్ల రసాలు లేదా చల్లని మజ్జిగలో కలిపి పిల్లలకు తాగించవచ్చు. సగ్గుబియ్యంతో తయారు చేసే జావ కూడా వేసవి తాపాన్ని హరిస్తుంది.
- పుచ్చకాయ, కర్బూజా, బొప్పాయి, నారింజ, స్ట్రాబెర్రీ, దానిమ్మ, మామిడి లాంటి తాజా పండ్లను పిల్లలకు తినిపించాలి. కీరా ముక్కలు, తాటి ముంజలు కూడా మేలు చేస్తాయి.
- పాలకూర, టమాటా, కేరట్, బీట్‌రూట్, సొరకాయ, బీరకాయ లాంటి కూరగాయలతో చేసిన వంటలను భోజనంలో చేర్చాలి.
- తాజా కూరగాయలు, పండ్లతో సలాడ్స్, స్మూతీలు తయారు చేసి ఇస్తే పిల్లలు ఇష్టంగా తింటారు.
- ఉదయం అల్పాహారంగా ఇడ్లీ, దోశ, పెసరట్టు, పోహా లాంటి తేలికగా జీర్ణమయ్యేవాటిని తినిపించాలి. మధ్యాహ్న భోజనంలో రకరకాల కూరగాయలతో తయారు చేసిన సాంబార్, మజ్జిగ ఉండేలా చూడాలి. వీటివల్ల పిల్లలకు జీర్ణశక్తి మెరుగుపడుతుంది. శరీరంలో నీటిశాతం నిలిచి ఉంటుంది. రాత్రి భోజనంలో ఆరోగ్యకరమైన సూప్‌ని చేర్చాలి. సాధ్యమైనంతవరకూ నూనె, మసాలా పదార్థాలను పిల్లలకు పెట్టకపోవడమే మంచిది.
- సాయంకాలం పిల్లలు ఆకలి అన్నప్పుడు కొన్ని డ్రై ఫ్రూట్స్, ఖర్జూరాలు, మొలకలు, తేనె కలిపిన పండ్ల ముక్కలు తినిపించవచ్చు.



'భంభం భోలే...' అంటూ ఖంగుమని మోగే కంచుకంఠం కైలాష్ ఖేర్‌ది! 'జేజమ్మ...', 'వచ్చాడయ్యా సామి...', 'కథానాయక...' లాంటి పాటలతో తెలుగువారికి దగ్గరయిన కైలేష్ ఖేర్ 19 భాషల్లో తన గానాన్ని వినిపిస్తున్నారు. ఆయన ఆత్మకథ 'తేరీ దివానీ' ఇటీవల విడుదలయింది. ఈ నేపథ్యంలో ఆయన 'నవ్య'కు ఇచ్చిన ఇంటర్వ్యూ...

సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం



చాలా మంది జీవితంలో చివరి దశలోనే ఆత్మకథలు రాస్తారు... మీరు ఇప్పుడే రాయటానికి కారణాలేమిటి?

నా ఉద్దేశంలో ప్రతి వ్యక్తి జీవితం ఒక అందమైన కథ. దీనిలో అనేక పార్శ్వాలు ఉంటాయి. ఇవి కూడా మనల్ని అభిమానించేవారికి తెలియాలి. అయితే ఈ పార్శ్వాలను ఎంత జాగ్రత్తగా, ఎంత నిబద్ధతతో వారి దగ్గరకు తీసుకువెళ్తున్నామనేది ముఖ్యం. దీనికి మాధ్యమంగా నేను పుస్తకాన్ని ఎంచుకున్నాను. ఇక నా జీవితం సంగీతంతో ముడిపడి ఉంది. అందరికీ నేను ఒక గాయకుడిగా మాత్రమే తెలుసు. చాలాకాలంగా నా అభిమానులు నా దగ్గరకు వచ్చి "మీ పాటలు మా హృదయాన్ని తాకుతాయి. మీరు మనసు పెట్టి పాడతారు. అలా పాడటానికి వెనుక ఉన్న కారణాలేమిటి?" అని అడుగుతూ ఉంటారు. వారి కోసమే 'తేరీ దివానీ' అనే ఈ పుస్తకాన్ని తీసుకువచ్చాను. ఒక సామాన్యుడు అసామాన్య కళాకారుడిగా ఎలా రూపుదిద్దుకున్నాడన్నదే ఈ పుస్తక కథ. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ఈ పుస్తక ప్రచురణకర్తల్లో నేను కూడా ఒకడిని. ఎందుకంటే - మంచి పుస్తకాలు అందరి దగ్గరకు వెళ్లాలనేదే నా కోరిక. అందుకే కైలాస ఎడ్వర్‌టైజింగ్ అనే సంస్థను ఏర్పాటు చేసి 'పెంగ్విన్' సంస్థతో కలిపి ఈ పుస్తకాన్ని ప్రచురించాం.

పుస్తక రచన సమయంలో మీ అనుభవాలేమిటి?

మనం ప్రపంచాన్ని ఎలా చూస్తే అలా కనిపిస్తుంది. ఒక ఏనుగును నలుగురు అంధులు వేరు వేరుగా చూస్తారు. వారి వారి అనుభవాలు వారికి ఉంటాయి. మనం కూడా అంతే. మనకు తెలిసిందే ప్రపంచం అనుకుంటాం. కానీ ఈ పుస్తకం రాసేటప్పుడు నాకు అనేక అనుభవాలు కలిగాయి. ఆ సమయంలో కైలాష్ కేర్ పైకి కనిపిస్తాడు. కానీ వాడి చేత రాయించేవాడు ఈశుడే! ఈ విషయం నాకు పుస్తకం రాసే సమయంలో అర్థమయింది. ఆ సమయంలో నాకు ఒక మిత్రుడు సహకరిస్తున్నాడు. ఒక రోజు మేమిద్దరం కలుసుకోవాల్సి ఉంది. కానీ తను నాకు ఫోన్ చేసి- "నేను రాలేను" అని చెప్పాడు. ఎందుకో అప్పుడు నాకు - 'క్యా సజనా... బిన్ సజనా..' అనే రెండు మాటలు అప్రయత్నంగా వచ్చాయి. ఆ మాటల నుంచి అప్రయత్నంగా పాట పుట్టుకువచ్చింది. ఆ పాటను త్వరలోనే విడుదల చేయబోతున్నాం. ఇలాంటి అనుభవాలెన్నో.

మీ ఆలోచనలు సంగీతంలో ఉంటాయా? మాటల్లో ఉంటాయా?

నేను దేన్నీ ఆలోచించను. మనసులో వచ్చిన ఆలోచనలను ఎప్పటికప్పుడు మాటల రూపంలో పెడతానంతే! మాట్లాడినప్పుడు కూడా అంతే! అందుకే నా మాటల్లో స్పష్టత ఉంటుంది. మాటలు నది మాదిరిగా ప్రవహిస్తూ ఉంటాయి.

మన దేశంలో సినిమా సంగీతానికి ఉన్న ప్రాధాన్యత దేశీయ సంగీతానికి ఉందని మీరు అనుకుంటున్నారా?

మన దేశంలో సినిమా పాటలకు ఆదరణ ఎక్కువ. కానీ దేశీ సంగీతానికి కూడా స్థానికంగా చాలా ప్రాధాన్యం ఉంటుంది. మన దేశంలో ప్రతి ప్రాంతానికి ఒకో ప్రత్యేకత ఉంది. అక్కడ ఉన్న సంగీతం ఇతరులు కూడా విన్నప్పుడు దానిలో ఉన్న గొప్పదనం అర్థమవుతుంది. నేను గత పదేళ్లుగా 'భారత్‌కా అమృత్ కలశ్' అనే రియాలిటీ షో నిర్వహిస్తున్నాను. దీనిలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన వారి వారి వేష భాషల్లో వచ్చి పాటలు పాడతారు. ఛానల్స్‌లో కూడా ఇలాంటి షోలు రావాలి. లేకపోతే వాళ్ల రియాలిటీ షోలకు 'ఫిల్మీ రియాలిటీ షో' అని పేరు పెట్టుకోవాలి.

మీతో కలిసి ఆల్బమ్స్ చేయటానికి చాలామంది ఔత్సాహికులు వస్తూ ఉంటారు.. వారికి మీరు ఇచ్చే సలహా ఏమిటి?

సిద్ధి లేకుండా ప్రసిద్ధి చెందలేం. అంటే చాలా కష్టం తర్వాతే విజయం లభిస్తుంది. దానివల్ల ప్రసిద్ధులమవుతాం. కానీ ఈ మధ్యకాలంలో సులభంగా ప్రసిద్ధి చెందాలనే ఆలోచన చాలామందిలో కనిపిస్తోంది. మనల్ని ఇష్టపడే అభిమానుల సంఖ్య క్రమంగా పెరగాలి. అంతేతప్ప ఒకేసారి లక్షలమంది రావాలనుకోకూడదు. ఒక పాట హిట్ అయిన వెంటనే ప్రపంచాన్ని జయించామని అనుకోకూడదు.

కైలాష్ ఖేర్ ఎప్పుడూ సనాతన ధర్మాన్ని ప్రచారం చేస్తూ కనిపిస్తారు. శుద్ధమైన హిందీలో మాట్లాడతారు. అందుకు కారణమేదైనా ఉందా?


గత కొద్దికాలంగా నేను మాట్లాడే భాషలో కూడా మార్పు వచ్చింది. ఒకప్పుడు నేను మామూలుగా మాట్లాడేవాడిని. ఇప్పుడు శుద్ధంగా మాట్లాడటం నేను నేర్చుకున్నాను. నేను పాటలు పాడటం మొదలుపెట్టినప్పుడు నాకు ఏమీ తెలీదు. సినిమా పాటలు, 'చిత్రహార్' లాంటివి తెలీదు. టీవీలో షోలు కూడాఎప్పుడూ చూడలేదు. అలాంటి నేను ఇప్పుడు 19 భాషల్లో పాడుతున్నానంటే ఏదో ఒక కారణం ఉండాలి కదా! ఆ కారణం ఆధ్యాత్మికత. నా ఉద్దేశంలో ఆధ్యాత్మికత లేకపోతే భారత దేశం లేదు. ఇంగ్లీషు సంస్కృతి నాలుగైదు వందల సంవత్సరాల క్రితం వచ్చిందే. అంతకుముందు నుంచి 'బతుకు...బతకనివ్వు' అనేది మన సంస్కృతి. 'అందరూ బావుండాలి... అందులో మనం ఉండాలి' అనేది మన సంస్కృతి. ఇక్కడ ఇంకో విషయం కూడా చెప్పాలి. ప్రపంచంలో అందరూ యంత్రాలు తయారుచేస్తున్న సమయంలో మనం మంత్రాలు జపించేవాళ్లం. వాళ్లు యంత్రాలు తయారుచేసి పిచ్చి వాళ్లు అయిపోయారు. ఇప్పుడు వారు మానసిక ప్రశాంతత కోసం మన దగ్గరకు వస్తారు. అంటే మన సంస్కృతి అంత గొప్పది. అలాంటి భావనను నేను ఎప్పుడూ వదలను. కైలాష్ కేర్ ఎప్పుడూ మారడు. ఆధ్యాత్మికతను వదలడు.

• సివిఎల్ఎన్ ప్రసాద్



కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు.

వెండితెర ఎంట్రీ దక్కాలంటే ఆషామాషీ విషయం కాదు. అలాంటిది ఇండస్ట్రీనే ఎర్రతివాచీ వేసి ఆహ్వానిస్తే ఎలా ఉంటుంది. పరిశ్రమలో నటీనటుల వారసుల పరిచయానికి ఉండే క్రేజ్ వేరు. కొత్తగా వచ్చే వారసులకు తమ తల్లిదండ్రుల అభిమానుల ఆదరణ కూడా విశేషంగా ఉంటుంది. అలా వెండితెర ఎంట్రీ ఇస్తున్న కొత్త తరంపై ఓ లుక్కేద్దాం.



వారసులు వచ్చేస్తున్నారు...



ఎన్టీఆర్ నటవారసత్వాన్ని నందమూరి బాలకృష్ణ అందుకొన్న విషయం తెలిసిందే. ఇప్పటికే ఆ కుటుంబం నుంచి మూడు తరాల నటులు ఇండస్ట్రీకి పరిచయమయ్యారు. తాజాగా, ఆ కుటుంబం నుంచి నాలుగో తరానికి చెందిన ఇద్దరు నూతన కథానాయకులు చిత్రసీమను పలకరించనున్నారు. అందులో ఒకరు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ కాగా, మరోకరు హరికృష్ణ మనవడు, జానకిరామ్ తనయుడు తారకరామారావు. కథానాయకుడు బాలకృష్ణ తనయుడు మోక్షజ్ఞ వెండితెర ఆరంగేట్రం కోసం నందమూరి అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్నారు. 2024లో వారి ఎదురుచూపులు ఫలించాయి. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా దర్శకుడిగా మారిన ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించే ఓ చిత్రం ద్వారా మోక్షజ్ఞ హీరోగా పరిచయమవ్వనున్నట్లు అధికారికంగా వెల్లడించారు. ఇది ప్రశాంత్ వర్మ సినిమాటిక్ యూనివర్స్‌లో సూపర్ హీరో కథాంశంతో తెరకెక్కనుంది. త్వరలోనే చిత్రీకరణ ప్రారంభం కానుంది. దీని తర్వాత తన తండ్రి బాలకృష్ణ దర్శకత్వంలో 'ఆదిత్య 999 మ్యాక్స్' చిత్రంలో మోక్షజ్ఞ నటించనున్నారు. బాలకృష్ణ కథానాయకుడిగా సింగీతం శ్రీనివాసరావు తెరకెక్కించిన సూపర్ హిట్ చిత్రం 'ఆదిత్య 369'కు సీక్వెల్‌గా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. అలాగే, "సార్', 'లక్కీ భాస్కర్ చిత్రాలతో సూపర్‌హిట్‌లు అందుకొన్న వెంకీ అట్లూరీ కూడా మోక్షజ్ఞ కోసం ఓ కథ తయారుచేశారట. నట వారసులను, కొత్తతరాన్ని ఇండస్ట్రీకి పరిచయం చేయడంలో ముందుంటారు దర్శకులు వైవీఎస్ చౌదరి. ఆయన దర్శకత్వంలో తెరకెక్కబోతున్న ఓ సినిమాలో జానకీరామ్ తనయుడు తారకరామారావు కథానాయకుడిగా ఎంట్రీ ఇస్తున్నారు. ఇటీవలె ఈ సినిమాను ప్రకటించడంతో పాటు తారకరామారావు లుక్‌ను విడుదల చేశారు. ఇందులో కథానాయికగా వీణా రావు నటిస్తున్నారు. ఈ ఏడాదే సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.



మరో మేనల్లుడు సిద్ధం

ఘట్టమనేని కుటుంబం నుంచి తెరంగేట్రం చేసేందుకు మరో వారసుడు సిద్ధమయ్యారు. మహేశ్‌బాబు అల్లుడిగా ఇప్పటికే అశోక్ గల్లా 'హీరో' సినిమాతో పరిచయమై ప్రేక్షకులను మెప్పించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు అశోక్ తమ్ముడు సిద్ధార్థ్ గల్లా కూడా సిల్వర్‌స్క్రీన్ వైపు అడుగులేస్తున్నారు. రచయిత గోపీ మోహన్ దర్శకత్వంలో ఇది తెరకెక్కనుంది. అలాగే, మహేశ్‌బాబు అన్న కుమారుడు రమేశ్‌బాబు తనయుడు కూడా వెండితెరపై అలరించేందుకు ముస్తాబవుతున్నారు.

బాలనటులుగా

మంచు కుటుంబం నుంచి మూడో తరం వారసులు వెండితెర ఎంట్రీకి రెడీ అయ్యారు. మంచు మోహన్‌బాబు, ఆయన తనయులు విష్ణు, మనోజ్ నటులుగా ఇప్పటికే ఇండస్ట్రీలో ఉన్నారు. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'కన్నప్ప'. ఈ సినిమాతో ఆయన తనయుడు అవ్రామ్, కుమార్తెలు అరియాన, వివియాన బాలనటులుగా పరిచయం అవుతున్నారు. భారీ తారాగణంతో ముఖేశ్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం ఏప్రిల్ 25న విడుదల కానుంది.

డియోల్ కుటుంబం నుంచి..



'యానిమల్' సినిమాతో ఫామ్‌లోకి వచ్చారు బాబీ డియోల్. ఆయన కుమారులు ఆర్యమన్ డియోల్, ధరమ్ డియోల్ కూడా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇవ్వడానికి సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. తెలుగులో ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా 2023లో విడుదలై ఘనవిజయం సాధించిన 'బేబీ' సినిమాను ఆర్యమన్ డియోల్ హీరోగా తెరకెక్కించనున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాలో దివంగత నటుడు ఇర్ఫాన్ ఖాన్ తనయుడు బాబిల్ కూడా నటించనున్నట్లు టాక్. హీరోయిన్లుగా సారా అలీఖాన్, క్రితి శెట్టి పేర్లను పరిశీలిస్తున్నారు.

సైఫ్ నటవారసుడు



బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్ వారసురాలిగా సారా అలీ ఖాన్ ఇప్పటికే సినిమాల్లో ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఇప్పుడు సైఫ్ తనయుడు ఇబ్రహీం అలీఖాన్ హీరోగా ప్రేక్షకుల ముందుకు వచ్చారు. షౌనా గౌతమ్ దర్శకత్వంలో తెరకెక్కిన 'నదానియాన్' చిత్రంలో నటించారు. ఇటీవలె ఈ సినిమా విడుదలైంది. ఆయన ప్రస్తుతం కునాల్ దేశ్‌ముఖ్ దర్శకత్వంలో 'దిలెర్' అనే చిత్రంలో నటిస్తున్నారు. ఇందులో శ్రీలీల కథానాయికగా నటిస్తోంది.

మెగాఫోన్‌తో...

స్టార్ హీరోల వారసులు ఎక్కువ మంది నటులుగా మారుతుంటే.. వారికి భిన్నమైన దారిలో ప్రయాణిస్తున్న వారూ ఉన్నారు. తమిళ కథానాయకుడు విజయ్ తనయుడు జేసన్ సంజయ్ దర్శకుడిగా మెగాఫోన్ పట్టనున్నారు. సందీప్ కిషన్ హీరోగా ఓ చిత్రాన్ని రూపొందిస్తున్నారు.



బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ తనయుడు ఆర్యన్ ఖాన్ కూడా దర్శకత్వం వైపు అడుగులేస్తున్నారు. 'బా..డ్స్ ఆఫ్ బాలీవుడ్' పేరిట నెట్‌ఫ్లిక్స్ రూపొందిస్తున్న ఈ సెటైరికల్ వెబ్ సిరీస్‌కు ఆర్యన్ ఖాన్ దర్శకుడు. ఇందులో షారుక్ ఖాన్, ఆమిర్ ఖాన్, సల్మాన్ ఖాన్ తదితరులు అతిథి పాత్రల్లో మెరవనున్నారు.

యంగ్ పవన్‌గా..

పవన్‌కల్యాణ్ తనయుడు అకీరా నందన్ వెండితెరపైకి ఎంట్రీ ఇవ్వకున్నా.. మెగా అభిమానులకు బాగా సుపరిచితమే. అప్పుడప్పుడు సోషల్ మీడియాలో అకీరా చేసే వీడియో ఎడిట్స్‌ను మెచ్చుకుని మురిసిపోతుంటారు మెగాభిమానులు. ప్రస్తుతం పవన్ కథానాయకుడిగా 'సాహో' ఫేమ్ సుజీత్ దర్శకత్వంలో 'ఓజీ' తెరకెక్కుతోంది. ఇందులో పవన్ ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో అకీరా మెరవనున్నట్లు టాక్.

నటించే సామర్థ్యంతో పాటు కీబోర్డ్ ప్లేయర్‌గానూ అకీరాకు ప్రవేశముంది. దీంతో ఈ సినిమాలో తమ సంగీత బృందంలో అకీరాను చేర్చుకునే ఆలోచనలో ఉన్నట్లు తమన్ తెలిపారు.





అబలలు కాదు..


కర్రసాముకైనా రెడీ


కొండనైనా పిండి చేస్తాం..





మహిళలు అంటే అబల కాదు.. సబల అని చాటి చెప్పారు.. తమ శక్తి ఇదీ చూపించారు. కర్రసాము చేశారు.. కాలుతున్న పెంకులను ఒక్క చేతి దెబ్బతో పగలగొట్టారు.. ఏలూరు సీఆర్‌ఆర్ కళాశాల ఆడిటోరియంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని ఆత్మరక్షణ విద్యలో భాగంగా విద్యార్థినుల ప్రదర్శనలు అబ్బుర పరిచాయి. బాల్య వివాహాల వల్ల అనర్థాలపై కళాజాత బృందం ప్రదర్శించిన నృత్యరూపకం ఆకట్టుకుంది. ఈ సందర్భంగా మహిళలు ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ పరిశీలించారు.


ఆకట్టుకున్న నాటక ప్రదర్శన


మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్


కళాకారులను సత్కరించిన కలెక్టర్


ఏలూరు ఫైర్‌స్టేషన్ సమీపంలో పోలీస్ విశ్రాంతి భవనం నిర్మాణానికి శిలాఫలకం ప్రారంభిస్తున్న మంత్రి మనోహర్, ఎంపీ మహేశ్ యాదవ్, ఎమ్మెల్యే చంటి, కలెక్టర్ వెట్రిసెల్వి తదితరులు

పోలీస్ సేవలు అభినందనీయం

ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్

64.80 లక్షలతో మహిళా పోలీస్ డార్మిటరీకి శంకుస్థాపన

ఏలూరు క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : శాంతి భద్రతల పరిరక్షణ, ప్రజా రక్షణకు రాత్రింబవళ్ళు పనిచేసే పోలీస్ సేవలు అభినందనీయమని ఏలూరు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. శనివారం ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ కృషితో మహిళా పోలీస్ డార్మెటరీ నిర్మాణం కోసం ఎంపీ ల్యాండ్ నిధుల నుంచి కేటాయించిన రూ.64.80 లక్షలతో నిర్మించనున్న మహిళా పోలీస్ డార్మిటరీ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున మహిళా పోలీస్ డార్మిటరీ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం అభినందనీయమన్నారు. ఎంపీ మహేష్ మాట్లాడుతూ పోలీసు వ్యవస్థకు మెరుగైన వసతులు కల్పించాలనే ఉద్దేశంతో ఎంపీ నిధులను మంజూరు చేశామన్నారు. ముందుగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా పోలీస్ సిబ్బందికి శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ సందర్భంగా మహిళా పోలీస్ డార్మిటరీ నిర్మాణానికి నిధులు కేటాయించిన ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేష్ కుమార్‌కు మహిళా పోలీసు సిబ్బంది, హోం గార్డులు తరపున ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఏలూరు కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కిషోర్, జేసీ పిధాత్రిరెడ్డి, అడిషనల్ ఎస్పీ సూర్య చంద్రరావు, జడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, మేయర్ నూర్జహాన్, ఆర్టీసీ రీజనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి : ఐజీ అశోక్ కుమార్

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఏలూరు రేంజ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) జీవీజీ అశోక్‌కుమార్ అన్నారు. శంకుస్థాపన కార్యక్రమాలు అనంతరం మీడియాతో మాట్లాడారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలందరికి శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో ఇప్పటికే 30 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేస్తున్నామని మహిళలు మరింత నైపుణ్యం పెంచుకుని ఉన్నత విద్యను అభ్యసించి అన్ని రంగాల్లో సమానత్వం పొందాలన్నారు. మహిళలు, బాలికల రక్షణ కోసం రేంజ్ పరిధిలోని ఆరు జిల్లాల్లో ప్రత్యేక అభయ మహిళా పోలీస్ రక్షక బృందాలు, శక్తి టీమ్‌లను ఏర్పాటు చేశామన్నారు.జిల్లా ఎస్పీ కేపీఎస్ కిషోర్ మాట్లాడుతూ ఏలూరు జిల్లాలో మహిళా పోలీసులు, హోం గార్డులు 24 గంటలు ఎంతో కష్టపడి బందోబస్తులో పాల్గొంటున్నారని అలాంటి వారికి విశ్రాంతి తీసుకోవడానికి మహిళా దినోత్సవం రోజున పోలీస్ డార్మెటరీ నిర్మాణానికి చర్యలు తీసుకోవడం ఎంతో ఆనందదాయకమన్నారు. మహిళలకు సంబం దించిన కేసుల దర్యాప్తు వేగవంతం చేశామన్నారు.

ఆక్వాను ఆదుకోండి

ఆందోళన బాటలో రైతులు

ఆకివీడు జాతీయ రహదారిపై ధర్నా

ఆకివీడు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) :మూడేళ్లుగా ఆక్వాకు గడ్డుకాలం నెలకొంది. వాతావరణం సహకరించకపోవడం, ఆదిలోనే తెగుళ్ల విజృంభించడంతో రైతాంగానికి రొయ్యల సాగు కత్తిమీద సాములా మారింది. మేత ధరలు విపరీతంగా పెరగడం, రొయ్యి ధర పతనమవ్వడంతో రైతులు నష్టాలు మూటగట్టుకుంటున్నారు. గిట్టుబాటు ధర కల్పించాలంటూ రైతులు ఆందోళన బాట పట్టారు. ఆకివీడు మండల ఆక్వా రైతులు శనివారం గుమ్ములూరు సెంటర్‌లో 165 జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు.కొన్నిచోట్ల ప్రభుత్వానికి అసోసియేషన్ తరపున వినతిపత్రాలు అందజేశారు.

సబ్సిడీ అందించాలి

జనవరి నెల వచ్చే సరికి చెరువులు కళకళలాడేవి. గతేడాది, ఈ ఏడాదిలో ఖాళీ చెరువులు కనబడుతున్నాయి. నష్టాల భయంతో పెట్టుబడులు పెట్టలేక ఖాళీగా వదిలేశారు. 120 కౌంటులో తెగుళ్ల రావడంతో పట్టుబడి పట్టేయాల్సి వస్తుంది. ఈ మధ్య కాలంలో 100 కౌంటు దాటిన దాఖలాలు లేవు. గతంలో లీజు రూ.1.30 లక్షల్లో ఉండగా సాగు దిగుబడులు లేకపోవడంతో లీజులు రూ.80 వేలు వరకూ పడిపోయాయి.ప్రతీ కౌంటుకు సుమారు రూ.25 పైబడి గిట్టుబాటు ధర ఉంటే రైతులు నష్టపోరు. మేతలు, మందులు ధరలు తగ్గించడంతో పాటు ప్రభుత్వం విద్యుత్ సబ్సిడీ కల్పించితే సాగు కొనసాగిస్తారు.

● గిట్టుబాటు ధర ఉండడం లేదు



రేయింబవళ్లు కష్టపడి నాలుగైదు నెలలు పండించిన రొయ్యలకు కంపెనీల వారు రేట్లు తగ్గించి కొనుగోలు చేస్తుండడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. ఆక్వా మేతల ముడిసరుకు రేట్లు యాభై శాతం తగ్గినప్పటికీ మేతలు, మందుల రేట్లు విపరీతంగా పెరిగిపోతున్నాయి. దోపిడీకి గురవుతున్నాం.

- ముప్పానేని నాగేశ్వరరావు, సర్పంచ్, తరటావ

● సిండికేట్‌గా మారి ధర తగ్గిస్తున్నారు



ఆక్వాజోన్‌లో రొయ్యల సాగు బాగానే జరుగుతున్నది. రొయ్యల ఎగుమతి కంపెనీదారులు సిండికేట్‌గా మారి ధరలు తగ్గించి కొనుగోలు చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో కిలోకి రూ.50 వరకూ తగ్గించారు. తప్పని పరిస్థితుల్లో సరుకును తక్కువ రేట్లుకు కంపెనీల వాళ్ళకు ఇవ్వవలసి వస్తుంది.

- ముద్దే విశ్వేశ్వరరావు, సర్పంచ్, దుంపగడప


ఆకివీడు 165 జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న ఆక్వా రైతులు

● గత ప్రభుత్వ తప్పిదాలతో ఇబ్బందులు



మేతలు, మందుల కంపెనీలపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోవడంతో దోపిడీకి గురవుతున్నాం. గత ప్రభుత్వ తప్పిదాలతో నేడు ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వాలు కనీస మద్దతు ధర నిర్ణయించడం లేదు. ఎంఆర్పీ నియంత్రణ కూడా చేయడం లేదు. రొయ్యల రైతుల పరిస్థితి కొనబోతే కొరివి, అమ్మబోతే అడివి అన్న చం దంగా తయారైంది. కొనుగోళ్ళు, అమ్మకాలలోను త్రీవ నష్టాలు చవిచూడాల్సి వస్తుంది.

-మోటుపల్లి సుబ్బారావు, డీసీ వైస్ చైర్మన్, ఆకివీడు

● ఉపాధి కోల్పోతున్నారు



గిట్టుబాటు ధర లేకపోవడంతో కొందరు సాగు వదులు కుంటున్నారు. దీంతో వేల మంది రైతులు, లక్షల్లో ఉపాధి పొందుతున్న కార్మికుల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. కోల్డ్ స్టోరేజ్‌లు ఏర్పాటు చేయాలి. వరి మాదిరిగా రొయ్యలను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తే రైతులు నష్టపోరు. ప్రస్తుతానికి వరిసాగు బాగుండడంతో కొందరు ఆక్వా రైతులు వ్యవసాయం బాట పడుతున్నారు.

మర్రివాడ వెంకట్రావు, ఆక్వా రైతు సంఘం నాయకుడు, చినకాపవరం


డాక్టర్ పద్మినిని సత్కరిస్తున్న రిజిస్ట్రార్ దినేష్‌శంకర్‌రెడ్డి

నిట్‌లో ఘనంగా మహిళా దినోత్సవం

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : తాడేపల్లిగూడెం నిట్‌లో మహిళా దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యురాలు డాక్టర్ చిట్యాల పద్మినిని ఘనంగా సత్కరించారు. డాక్టర్ పద్మిని, డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ డాక్టర్ హిమబిందు, ఎస్‌పీఎస్ విభాగాధిపతి డాక్టర్ సౌమ్య జోస్ మాట్లాడుతూ మహిళా విద్య ద్వారానే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అనంతరం వివిధ పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసా పత్రాలను అందజేశారు.

చిన వెంకన్న క్షేత్రంలో సాయంకాలార్చన సమయం మార్పు

ద్వారకాతిరుమల, మార్చి 8(ఆంధ్రజ్యోతి): సూర్యాస్తమయ కాలానికి అనుగుణంగా ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో సాయంకాలార్చన సమయాన్ని ఈనెల 14 నుంచి మార్పు చేస్తున్నట్లు ఆలయ ఈవో ఎన్వీ సత్యన్నారాయణమూర్తి తెలిపారు. ఇప్పటి వరకూ సాయం కాలార్చన సమయం సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకూ ఉందన్నారు. దానిని సాయంత్రం 05.30 గంటల నుంచి 7 గంటల వరకు మార్పు చేసినట్లు వివరించారు. సాయంకాలార్చన అనంతరం తిరిగి 7 గంటల నుంచి స్వామిదర్శనం లభిస్తుందని భక్తులు గమనించాలని కోరారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయం

గోవిందనామాలతో శ్రీవారి క్షేత్రం శనివారం శోభిల్లింది. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయానికి ఉదయం నుంచి భక్తులు వచ్చారు. దాదాపు 20 వేల మంది స్వామివారిని దర్శించి ఉంటారని అధికారులు అంచనా. స్వామివారి నిత్యార్జిత కల్యాణంలో దాదాపు 180 వరకూ జంటలు పాల్గొన్నాయి.


ఆలయంలో భక్తులు

రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

భీమవరం క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు రూరల్ హెడ్ కానిస్టేబుల్ మహేశ్వరరావు తెలిపారు. భీమవరం మండలం నాగిడిపాలెం గ్రామానికి చెందిన తిరుమాని రాముడు (52) ఈ నెల 2వ తేదీన సైకిల్‌పై బయటకు వెళుతుండగా కోళ్ళతో వస్తున్న వ్యాన్ ఢీకొట్టింది. దీంతో అతనిని విజయవాడ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు హెచ్‌సి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కొండరెడ్డి గ్రామంలో ఇల్లు దగ్ధం

బుట్టాయగూడెం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏరుమద్దిగూడెం కొండరెడ్డి గ్రామంలో శనివారం గురుగుంట్ల లక్ష్మికి చెందిన తాటాకు ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రమాదం జరిగిన సమయంలో బాధితురాలు లక్ష్మీ పోలం పనులకు వెళ్ళింది. రూ.10 వేల నగదు, రేషన్, సామగ్రి కాలి బూడిదైనట్లు బాధితురాలు వాపోయింది.


మద్యం స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ అధికారులు

రూ.3 లక్షల విలువైన మద్యం స్వాధీనం

తణుకు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : యానాం నుంచి కంతేరుకు అక్రమంగా తరలిస్తున్న రూ. 3 లక్షల విలువైన మద్యం మద్యం స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కుమరేశ్వరన్ చెప్పారు. శనివారం సాయంత్రం తణుకు ఎక్సైజ్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఈ కేసులో ఇరగవరం మండలం కంతేరు గ్రామానికి చెందిన కొవ్వూరు వెంకట శ్రీనివాసరెడ్డిని అరెస్టు చేసి అతని వద్ద ఉన్న 3 లక్షల విలువుగల మద్యం సీసాలతో పాటు కారు స్వాధీనం చేసుకున్నా మన్నారు. సీఐ సత్తి మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బం దితో దాడి చేసి పట్టుకున్నారన్నారు. ఇదే కేసులో వెంకట సత్య నారాయణరెడ్డి అనే భరత్‌రెడ్డి, ప్రేమ్ కుమార్‌లు పరారీలో ఉన్నట్లు చెప్పారు. నిందుతుడు శ్రీనివాసరెడ్డిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

క్రైమ్ కార్నర్

భార్యతో గొడవ.. భర్త ఆత్మహత్య

ఏలూరు క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : భార్యతో గొడవపడిన ఒక వ్యక్తి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏలూరు రూరల్ మండలం పోణంగి గ్రామానికి చెందిన బొల్లారి పురుషోత్తమ్ (58)కి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. పిల్లలకు వివాహాలయ్యాయి. మద్యానికి బానిస అయిన పురుషోత్తమ్ తరచుగా భార్యతో గొడవ పడుతున్నాడు. దీంతో అతనిని భార్య, పిల్లలు మందలించారు. తీవ్ర మనస్థాపానికి గురైన అతను శనివారం ఉదయం పొలంలోకి వెళ్ళి పురుగుమందు తాగాడు. తీవ్ర అస్వస్థతకు గురైన అతనిని ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం మృతి చెందాడు. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాలిక అదృశ్యం..12 గంటల్లో ఛేదించిన పోలీసులు

భీమవరం క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయిన బాలిక ఆచూకీని భీమవరం టూటౌన్ పోలీసులు 12 గంటల్లోనే ఛేదించారని భీమవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య తెలిపారు. శనివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 36వ వార్డుకు చెందిన 11 ఏళ్ల బాలిక ఐదో తరగతి చదువుతోంది. ఇంట్లో వారు ఏదో అన్నారని ఈనెల 6వ తేదీ మధ్యాహ్నం స్కూల్ బ్యాగ్ తీసుకుని వెళ్లిపోయింది. తల్లిదండ్రులు అన్నిచోట్ల వెతికారు. చివరకు రాత్రి 11 గంటల సమయంలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన సీఐ కాళీచరణ్ వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ ప్రాంతంలోని ప్రతి ఇంటి వారిని రాత్రే నిద్రలేపి విచారణ చేశారు. కొన్నిచోట్ల ఉన్న సీసీ కెమెరాలు ద్వారా బాలిక కదలికలు గుర్తించారు. ఒక నివాసం వద్ద విచారిస్తున్న సమయంలో బాలిక సాయంత్రం ఇటువైపు వచ్చిందని ఫొటో తీయమంటే తీసిందని చెప్పారు. అక్కడ విచారించగా బాలిక టౌన్ రైల్వేస్టేషన్‌కు వెళ్లినట్లుగా గుర్తించారు. డాగ్ స్క్వాడ్, డ్రోన్ కెమెరాలు కూడా వినియోగించారు.


వివరాలు తెలుపుతున్న భీమవరం డీఎస్పీ జయసూర్య

విజయవాడలో ఉన్నట్లు గుర్తింపు

బాలిక రైల్వేస్టేషన్‌కు వెళ్లినట్లుగా తెలియడంతో ఇటు విశాఖ, విజయవాడ, హైదరాబాద్ రైల్వే జీఆర్‌పి పోలీసులను సీఐ అలర్ట్ చేశారు. విజయవాడ జీఆర్‌పీ పోలీసులు ఒక బాలిక అనుమానంగా కనపడటంతో ప్రజ్వల టీమ్ ద్వారా బాలికల వసతి గృహంలో ఉంచినట్లుగా తెలిపడంతో బాలిక ఫొటోలను అక్కడకు పంపించి ఆ బాలికే అని గుర్తించారు. వెంటనే విజయవాడ వెళ్లి బాలికను భీమవరం తీసుకువచ్చినట్లు డీఎస్పీ తెలిపారు. తల్లిదండ్రులకు, బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చారు. కేసు విషయంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ కాళీచరణ్, ఎస్ఐ ఇజ్రాయేల్, హెచ్‌సీ గోవింద్, పీసీలు నరేష్, గోపి,సిబ్బందిని డీఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం తాగొద్దని భార్య మందలించడంతో ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం, (ఏలూరు) మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : నిత్యం మద్యం సేవిస్తూ కుటుంబాన్ని పట్టించుకోకుండా తిరుగుతున్న భర్తను భార్య మందలించడంతో ఆమెను బెదిరించడానికి కలుపు మందు సేవించిన లాగు రవికుమార్ (32) మృతిచెందినట్టు లక్కవరం ఏఎస్సై భాస్కర్ తెలిపారు. మండలంలోని నాగులగూడెం గ్రామానికి చెందిన రవికుమార్‌కు సమ్మక్కతో గత ఐదేళ్ళ క్రితం వివాహం జరిగింది.వీరికి ఇద్దరు సంతానం. రవికుమార్ మద్యం సేవిస్తూ తిరుగుతూండడంపై ఈనెల ఏడవ తేదీన భార్య మందలించింది. దీంతో తన భార్యను బెదిరించడానకి కలుపు మందు తెచ్చుకుని అదేరోజు రాత్రి సేవించాడు. అపస్మారస్థితిలోకి వెళ్ళిన రవికుమార్‌ను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు ఏఎస్సై తెలిపారు. మృతుని భార్య సమ్మక్క పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

బాత్రూంలో డెలివరీపై డీసీహెచ్‌ఎస్ విచారణ



కైకలూరు, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): కైకలూరు ప్రభుత్వాసుపత్రి మరుగుదొడ్డిలో ఆడశిశువుకు జన్మనిచ్చి పారిపోయిన తల్లిని కైకలూరు టౌన్ పోలీసులు కనుగొన్నారు. మండలంలో ఓ గ్రామానికి చెందిన యువతిగా గుర్తించి శుక్రవారం అర్ధరాత్రి ఆ యువతి ఆమె తల్లిని కనుగొని కైకలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యసహాయం అందిస్తున్నారు. ఆ యువ తికి తండ్రి లేకపోవడంతో తల్లి సంరక్షణలో పెరుగు తోంది. తల్లి కూలి పనులు చేసుకుంటూ యువతిని పదో తరగతి వరకు చదివించింది. రెండు సంవత్స రాలుగా ఇంటి వద్దే ఉంటుంది. కొంతకాలంగా తల్లికి తమ్ముడు అయిన కె.గణేశ్‌తో (33) ప్రేమ సంబంధం కొనసాగుతుంది. అతను లారీ డ్రైవర్‌గా పని చేస్తు న్నాడు. ఈ దశలో యువతి గర్భం దాల్చిన విషయాన్ని ఎవరికి బయటకు చెప్పవద్దని చెప్తే చంపేస్తానని గణేశ్ బెదిరించడంతో ఈ విషయాన్ని తల్లికి సైతం తెలియకుండా దాచుకుంటూ వచ్చింది. కడుపునొప్పి వస్తుందని ఈనెల 6వ తేదీ రాత్రి తల్లి మరో బంధువుతో కలిసి కైకలూరు ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. వైద్య సిబ్బంది ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం బాధితు రాలు బాత్రూంకు వెళ్లగా ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఆ బిడ్డను బాత్రూం కప్‌బోర్డులో పడవేసి తల్లికూతురు పరారయ్యారు.

సీసీ కెమెరాల ఆధారంగా గుర్తింపు

పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ఆధారంగానే యువతిని గుర్తించారు.యువతి ఇంటికి వెళ్లి పోలీసులు వారికి నచ్చజెప్పి డెలీవరీ అయిన తరువాత చికిత్స పొందాలని తల్లిని, కుమార్తెను కైకలూరు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించి చికిత్స అందించారు. నిందితుడు గణేశ్‌పై రేప్ కమ్ పోక్సో కేసు నమోదు చేసినట్టు సీఐ పి.కృష్ణ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : 11 కెవి చిన అమిరం పీడర్‌పై చెట్లకొమ్మలు తొలగింపు, లైన్ల మరమ్మతుల నిమిత్తం 9వ తేదీ ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాయలం బైపాస్ రోడ్డు ఏరియాలోని కొన్ని ప్రాంతాలకు, చిన అమిరం గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ ఎన్.వెంకటేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేటి నుంచి 14వ తేదీ వరకు
అమ్మవార్ల నిజరూప దర్శనం నిలిపివేత

భీమవరంటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : గునుపూడి గ్రామ దేవత ఆదిలక్ష్మి, రాజ్యలక్ష్మి, పోలేరమ్మ వార్ల నిజరూప దర్శనం నిలిపివేస్తున్నామని ఈవో నాగరాజు తెలిపారు. ఆలయానికి రంగులు వేస్తున్న నేపథ్యంలో ఈ నెల 9వ తేదీ నుంచి 14 వరకు దర్శనాలు ఉండవన్నారు. భక్తులు గమనించి సహకరించాలని కోరారు.


సత్కారం అందుకున్న మహిళలతో సీతారామలక్ష్మి


పెద్దింట్లమ్మకు పూజలు చేస్తున్న తెలుగు మహిళలతో నాయకులు



నరసాపురంలో మహిళలకు లయన్స్ క్లబ్ సత్కారం



వైద్యురాలు డాక్టర్ యిర్రింకి లక్ష్మికి.. గుంపర్రులో మహిళలకు సత్కారం..

మహిళలు.. మహారాణులు

»ఘనంగా మహిళా దినోత్సవం »పలువురికి సత్కారం


భీమవరం కోపా కల్యాణ మండపంలో మహిళలకు సత్కారం

భీమవరం అర్బన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి): మహిళల అభివృద్ధితోనే సమాజాభివృద్ధి అని టీడీపీ రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం ముగింపు వేడుకను భీమవరం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. మహిళాభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషిచేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు కె. శిరిష, కె. విజయ, హరిప్రియ, అరుణగాయత్రి సరిత, నృత్య కళాకారిణి భాను శ్రీ, క్రీడాకారిణులను సీతారామలక్ష్మి సత్కరించారు. జిల్లా టీడీపీ మహిళా అధ్యక్షురాలు డాక్టర్ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యునియన్ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో యూనియన్ జోనల్ నాయకురాలు బి. అరుణ పాల్గొన్నారు

భీమవరం రూరల్: మహిళలకు యువత అన్ని రంగాల్లో ప్రోత్సాహం అందించాలని మహిళా వైద్యురాలు డాక్టర్ యిర్రింకి లక్ష్మి పేర్కొన్నారు. ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కో-ఆర్డినేటర్ డాక్టర్ పి.భువనేశ్వరి అధ్యక్షత జరిగిన వేడుకల్లో ఆమె పాల్గొన్నా రు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మురళీకృష్ణంరాజు మాట్లాడారు. డాక్టర్ యిర్రింకి లక్ష్మిని సత్కరించారు.

●మహిళలు విద్యావంతులైతేనే దేశాభివృద్ధి సాధ్యమని ఆంధ్రప్రదేశ్ శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్ రాజు అన్నారు. భీమవరం అంకాల ఆర్ట్స్ అకాడమిలో వైసీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలను సత్కరించి మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

భీమవరం టౌన్: కోపా కల్యాణ మండపంలో పలు రంగాల్లో సేవలు అందిస్తున్న 25 మంది మహి ళలను ఎమ్మెల్యే అంజిబాబు సతీమణి సత్యవాణి చేతుల మీదుగా సత్కరించారు. జిల్లా ఈస్టర్న్‌పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీలో విద్యుత్ సంస్థలో వివిధ విభాగాల్లో రాణిస్తున్న మహిళలకు ఉత్తమ పురస్కారాలు ఇచ్చి సత్కరించారు. ఎస్ఈ రఘునాథ్ బాబు, ఈఈ ఎన్. వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తణుకు: గౌరవప్రదమైన జీవితం దాతృత్వం కాదు ఇది మహిళల హక్కు అందుకై పోరాడదాం అనే అంశంపై సీపీఐ కార్యాలయంలో సదస్సు నిర్వహించారు. రిటైర్డ్ జిల్లా జడ్జి అడబాల లక్ష్మి, డిగ్రీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపల్ సంకు మనోరమ, స్త్రీ వైద్య నిపుణుడు వంక వసుంధర, మహిళా ఉద్యమ నాయకురాలు వావిలాల సరళాదేవి, రిటైర్డు లెక్చరర్ భూపతిరాజు ఝన్సీ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి సికిలే పుష్పకుమారి ప్రసంగించారు. అనంతరం పలువురు మహిళలను సన్మానించారు.

● మహిళలు ప్రతి రంగంలో ముందుండాలని ఏపీ సెక్రటేరియట్‌లో ఆర్థిక శాఖాధికారిణిగా పనిచేస్తున్న ముళ్ళపూడి భాస్కర లక్ష్మి అన్నారు. తణుకు మాంటిస్సోరి స్కూలులో జరిగిన వేడుకల్లో ఆమెను సత్కరించారు. మహిళల పురోభివృద్ధి కోసం ఉద్యమించాలని ప్రముఖ ఉద్యమనేత, విశ్రాంత ప్రిన్సిపాల్ సంకు మనోరమ అన్నారు. శనివారం రోటరీ క్లబ్‌లో జరిగిన వేడుకల్లో ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎస్‌కెఎస్‌డి మహిళా కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి, విశ్రాంత జిల్లా జడ్జి అడబాల లక్ష్మి, పట్టణ ప్రముఖులు యర్రమిల్లి విజయలక్ష్మి, వంక రాజకుమారి, వావిలాల సరళాదేవి, బసవా శ్రీదేవి, డాక్టర్ వంక వసుంధర, అలియా బేగం, జ్ఞానమంజరి, తమరాపు రమణమ్మ మాట్లాడారు.

అత్తిలి: అత్తిలికి చెందిన తెలుగు ఉపాధ్యాయిని, కవయిత్రి పెదపల్లి వెంకటరమణిని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో విశ్వ ఆర్ట్స్, ఆర్కే కళా సాంస్కృతిక ఫౌండేషన్ ఉమెన్ పవర్ ఐకాన్ అవార్డుతో సత్కరించారు. బల్లిపాడు మదనగోపాల్ స్కూల్లో మహిళలకు పలు పోటీలు నిర్వహించి డైరెక్టర్ తిరుపతి శ్రీనివాస్ దంపతులు బహుమతులు అందించారు. కృషి, పట్టుదలతో మహిళలు అన్ని రంగాలలో రాణించాలని అత్తిలి పీహెచ్‌సీ వైద్యాధికారి పి. సురేఖ అన్నారు. అత్తిలి డిగ్రీ కళాశాలలో ఆమెను సత్కరించారు.

తాడేపల్లిగూడెం అర్బన్: మహిళలు ఆర్థికంగా రాణించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం పార్టీ కార్యాలయం వద్ద పలు హోదాల్లో ఉన్న మహిళా ఉద్యోగులను, వీరమహిళలకు ఆయన తన సొంత ఖర్చులతో చీరలు అందజేసి సత్కరించారు. ఆర్డీవో ఖతీబ్ కౌసర్ బనో, ఎక్సైజ్ సీఐ స్వరాజ్యలక్ష్మి, ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

పెంటపాడు: అలంపురం టీబీఆర్ సైనిక్ స్కూల్ ప్రాంగణంలో సంస్థ ఛైర్మన్ తనుబుద్ధి భోగేశ్వరరావు ఆధ్వర్యంలో కేకు కట్ చేసి వేడుకలు జరిపారు. కరస్పాండెంట్ పద్మావతి, సీఈవో రవికిరణ్, హెచ్‌ఎం కళ్యాణి, ఏవో నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ప్రభుత్వ విప్ నాయకర్, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, జనసేన రాష్ట్ర కార్యదర్శి చాగంటి చిన్న మహిళలతో భారీ కేక్ కట్ చేయించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో, సీపీఎం కార్యాలయంలోను వేడుకలు జరిగాయి. లయన్స్ క్లబ్ సమాజ సేవకు పాటుపడిన పొన్నాడ పద్మావతి, సుభద్రదేవి, అల్లూరి నళినిదేవి, గంటా ఝాన్సీలక్ష్మి, తాళ్లూరి జోశ్నలను సత్కరించింది. అధ్యక్షులు ఎస్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలకొల్లు టౌన్: స్థానిక ఏఎస్ఎన్ఎం డిగ్రీ కళాశాలలో మున్సిపల్ మాజీ వైస్ ఛైర్‌పర్సన్ కర్నేన రోజారమణి, ప్రిన్సిపాల్ రాజరాజేశ్వరి, మహిళా అధ్యాపకులు, సిబ్బందిని సత్కరించారు. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

యలమంచిలి: గుంపర్రు గ్రామ సచివాలయంలో బీజేపీ నాయకుడు జడ్డు రామకృష్ణ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి ఎం.మాధురి, సచివాలయ సిబ్బంది ఎం.హేమావతి, ఎం.ఫణిశ్రీ, కె.మనశ్రీ లను సత్కరించారు. చించినాడ సచివాలయంలో నిర్వహించిన వేడుకల్లో సర్పంచ్ దంగేటి రాజమణి, ఎంపీటీసీ నల్లి సంధ్యారాణి, మహిళా ప్రజా ప్రతినిధులు, ఉద్యోగులను ఉపసర్పంచ్ రుద్రరాజు చిన్నా, స్థానిక నాయకులు సత్కరించారు. ముదునూరి రంగరాజు, విప్పర్తి సాయిబాబు, రేపూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెనుగొండ: చదువుకున్న మహిళ తన కుటుంబాన్ని, పిల్లలను సన్మార్గంలో నడిపించగలదని సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రి అన్నారు. పెనుగొండ పంచాయతీ కార్యాలయంలో మహిళా గ్రామ సభ నిర్వహించారు. కార్యదర్శి టి. రత్నాకరరావు పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ నక్కా శ్యామలా సోని శాస్త్రిని ఘనంగా సత్కరించారు. మహిళా వార్డు సభ్యులు, డ్వాక్రా మహిళలు, సీసీలు పాల్గొన్నారు. పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ కాసాని విజయలక్ష్మి అధ్యక్షతన వేడుకలు జరిగాయి. పెనుగొండ భాష్యం పాఠశాలలో చిన్నారులు 'నారి' అక్షర రూపంలో ఒదిగారు. ప్రిన్సిపాల్ అప్పారావు పాల్గొన్నారు.

పోడూరు: చట్టసభలు, అన్ని నామినేటెడ్ పోస్టులలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. పోడూరు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మహిళా ప్రజాప్రతినిధులు ఎంపీపీ సబ్బితి సుమంగళి, ఎంపీడీవో బి.మంగాకుమారి, ఈవోపీఆర్డీ వైభవతి, సివిల్ సప్లయ్ డీటీ నాగదేవితో పాటు మహిళా సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యదర్శులు, అధికారులను ఎమ్మెల్యే సన్మానించారు. జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, మండల టీడీపీ అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు, తహసీల్దార్ ఫాజిల్ పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం రూరల్: భారత రాజ్యాంగం మహిళలు, పురుషులకు సమాన ప్రాధాన్యమిచ్చిందని అందుకే మహిళ లు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని సీనియర్ సివిల్ జడ్జి, అదనపు సెషన్ జడ్జి కూనపరెడ్డి మాధవి పేర్కొ న్నారు. పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాల లో నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఆమె మాట్లాడా రు. తాడేపల్లిగూడెం ఎయిర్ స్ట్రిప్ మహిళా వాకర్స్ అధ్యక్షురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. పట్టణంలోని బీజేపీ కార్యాలయం వద్ద పట్టణ అధ్యక్షుడు దువ్వ శ్రీను ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పారిశుధ్య కార్మికులను సత్కరించారు. పట్టణ పోలీసుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు మానవహారంగా ఏర్పడ్డారు. డీఎస్పీ విశ్వనాథ్, పట్టణ సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్సైలు పాల్గొన్నారు.

మొగల్తూరు: స్థానిక వివేకా స్కూల్‌లో జరిగిన వేడుకల్లో మండలంలోని ఏడుగురు మహిళా సర్పంచ్‌లను సన్మానించారు. ఎంపీపీ అందే సూర్యావతి, ఎమ్మెల్యే నాయకర్ సతీమణి సునీత, రాష్ట్ర మహిళా కమిషన్ మాజీ సభ్యురాలు డాక్టర్ శిరిగినీడి రాజ్యలక్ష్మి, కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు. మొగల్తూరు ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అనంతపల్లి అరుణ మహిళలకు వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

గణపవరం: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, గణపవరం మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు సూచించారు. పిప్పర ప్రభుత్వ ఆసుపత్రిలో, గణపవరం పంచాయతీ ఆవరణలో మహిళా దినోత్సవం నిర్వహించారు. పిప్పర ఆసుపత్రిలో వైద్యాధికారిణులను సత్కరించారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో మొక్కలు నాటారు. గణపవరం పంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన వేడుకల్లో సర్పంచ్ మూరా అలంకారం, పిషరీస్ అసిస్టెంట్ షర్మిలాదేవిని సత్కరించారు.

కాళ్ల: సీసలి సచివాలయంలో సర్పంచ్ ధనలక్ష్మి దంపతులు కేక్ కట్ చేశారు. ఉండి డీసీ ఛైర్మన్ తోట ఫణిబాబు, వివిధ ప్రభుత్వ శాఖల మహిళా ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను సత్కరించారు.

ఆకివీడు: సృష్టికి మూలం స్త్రీ అని టీడీపీ మండల, పట్టణ అధ్యక్షులు మోటుపల్లి రామవర ప్రసాద్, బొల్లా వెంకట్రావు అన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా పార్టీ మహిళలతో కలిసి శనివారం స్థానిక పెద్దింట్లమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించి మాట్లాడారు. అనంతరం కౌన్సిలర్ అరుణకుమారి నివాసంలో కేక్ కట్ చేశారు. కౌన్సిలర్లు బత్తుల శ్యామల, మోపిదేవి సత్యవతి, తెలుగు మహిళా అధ్యక్షురాలు బచ్చు సరళకుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు బొర్రా సుజాత, ఇల్లాపు కృష్ణవేణి, మరియమ్మ, దేవస్థానం ఈవో రాజు, కిమిడి నాగరాజు పాల్గొన్నారు.


తణుకులో మాట్లాడుతున్న సంకు మనోరమ


మహిళలకు చీరలు అందజేస్తున్న ఎమ్మెల్యే బొలిశెట్టి


పోడూరులో మహిళా అధికారులు,
ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యే పితాని సత్కారం


పెనుగొండ భాష్యం పాఠశాలలో
'నారి' ఆకారంలో ఒదిగిన విద్యార్థులు


సర్పంచ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

మోడల్ ఉమెన్
ఫ్రెండ్లీ పంచాయతీగా నందమూరు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే అరుదైన ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా నందమూరు ఎంపిక కావడం అరుదైన అవకాశమని ఏపీఎస్ఐఆర్డీ పీఆర్ డిప్యూటీ డైరెక్టర్ ఎ. రమణ పేర్కొన్నారు. నందమూరులో శనివారం మోడల్ ఉమెన్ ఫ్రెండ్లీ శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కేంద్రం నిర్వహించే పోటీలో ఈ గ్రామం ఎంపికైతే మొదటి బహుమతిగా రూ.కోటి, రెండో బహుమతిగా రూ.75 లక్షలు, మూడో బహుమతిగా రూ.50లక్షలు సాధించవచ్చన్నారు. ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీ సర్పంచ్‌గా ఢిల్లీ వర్క్‌షాప్‌లో పాల్గొనేందుకు ఎంపికైన సర్పంచ్ శనగన వరలక్ష్మీ, కార్యదర్శి ఆకుల మణికంటేశ్వరిలను సత్కరించారు.

నమ్మకాన్ని వమ్ము చేయను : అంజిబాబు

భీమవరంటౌన్, మార్చి 8(ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో బాధ్యతలను నిర్వర్తిస్తానని, అవినీతి లేని పాలనను అందిస్తామని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. పీఏసీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి భీమవరం వచ్చిన ఆయనకు భీమవరం మండలం లోసరిలో కూటమి నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించారు. కూటమి శ్రేణులు పాల్గొన్నాయి.

ఇళ్ల స్థలాల హామీని నిలబెట్టుకోవాలి

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం పట్టణంలో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల స్థలాన్ని ఇస్తానని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. పార్టీ రాష్ట్ర కమిటి పిలుపు మేరకు ప్రజా సమస్యలపై ప్రజా చైతన్య సైకిల్ యాత్ర శనివారం కొండ్రుప్రోలు కేఎస్ఎన్ కాలనీలో చేపట్టారు. పట్టణ కార్యదర్శి కరెడ్ల రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.



ఉచిత వైద్య శిబిరం అభినందనీయం

ఉండి, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): మహిళలు అన్ని రంగాల్లో దూసుకు పోవాలని ఉండి జడ్పీటీసీ కనకదుర్గ కోరారు. శనివారం ఉండి బస్టాండ్ సమీపాన భీమవరం మిత్ర మెడికల్ ఆసుపత్రి ఆధ్వర్యంలో గుండాబత్తుల సుబ్బారావు నివాస ప్రాంగణంలో ఉచిత వైద్య శిబిరంను నిర్వహించారు. గుండాబత్తుల సుబ్బారావు ప్రతిఏటా మహిళా దినోత్సవం నిర్వహించడం అభినందనీయమని, ఈ సందర్భంగా గుండాబత్తుల దంపతులను మహిళలు సన్మానించారు.



పోడూరు మండల పరిషత్ సమావేశంలో
మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని

ప్రతి ఇంటికి తాగునీరు
కొడమంచిలి పంచాయతీపై విచారణ జరిపిస్తా
మండల పరిషత్ సమావేశంలో ఎమ్మెల్యే పితాని

ఆచంట, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): జల జీవన్‌మిషన్ పథకం ద్వారా త్వరలో ప్రతీ ఇంటికి మంచినీరు అందించేందుకు చర్యలు చేపట్టినట్టు ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం ఆచంట మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారి అధ్యక్షతన జరిగింది. పితాని ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ జిల్లా వాసులకు దొంగరావిపాలెంలో లిఫ్ట్ ఇరిగేషన్‌తో కుళాయి నీరు అందించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని, రూ. 84 కోట్లు పథకం నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోసం కేంద్రానికి పంపిందన్నారు. గత ప్రభుత్వం లో ఇల్లు మంజూరు అయిన లబ్ధిదారులందరూ కూడా మే నెలాఖరు నాటికి యిల్లు కట్టుకుంటేనే డబ్బులు అందించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య అందించాలన్నదే ధ్యేయమన్నారు. నియోజక వర్గంలో లో వోల్టేజి సమస్య పరిష్కారానికి సబ్ స్టేషన్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. కొడమంచిలి పంచాయతీలో జరిగిన అనేక అవకతకలుపై త్వరలోనే విచారణ జరిపిస్తున్నట్లు పితాని తెలిపారు. ఈ సందర్భంగా మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీపీ దిగుమర్తి సూర్య కుమారితోపాటు మహిళా ప్రజా ప్రతినిధులు, మహిళా అధికారులను ఎమ్మెల్యే సత్కరించారు. జడ్పీటీసీ సురేష్‌బాబు, వైస్ ఎంపీపీలు శ్రీనివాస్, నాగరాజు, ఎంపీడీవో బాబ్జి, తహసీల్దార్ కనకరాజు, పాల్గొన్నారు.

ప్రజావసరాలపై దృష్టి పెట్టండి

పోడూరు: గ్రామాల్లో కనీస వసతులపై అధికారులు దృష్టి పెట్టాలని ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. శనివారం ఎంపీపీ సబ్బితి సుమంగళి అధ్యక్షతన జరిగిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పథకం ద్వారా ఎక్కువ మంది కూలీలకు పని కల్పించాలన్నారు. ఏప్రిల్‌లో రేషన్ కార్డులు అందచేసిన తర్వాత కొత్త పెన్షన్లు, ఇళ్ల స్థలాల పంపిణీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. సర్పంచులు, ఎంపీటీసీలు పలు సమస్యలను సమావేశం దృష్టికి తెచ్చారు. దీనిపై ఎమ్మెల్యే అధికారుల పనితీరుపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయనీ పనితీరు మార్చుకో వాలని హెచ్చరించారు. గ్రామాల్లో యుద్ధప్రాతిపదికన చేపట్టాల్సిన పనులకు ప్రతిపాదనలు చేసి తీసుకొస్తే నిధులు మంజూరు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జడ్పీటీసీ గుంటూరి పెద్దిరాజు, పాలకొల్లు డీసీ ఛైర్మెన్ పెన్మెత్స రామభద్రరాజు, తహసీల్దార్ ఫాజిల్, ఎంపీడీవో బి.మంగాకుమారి, వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న మహిళా ప్రజాప్రతినిధులు, అధికారులు

మండల పరిషత్ సమావేశంలో వేడుకలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండల పరిషత్ సమావేశం శనివారం ఎంపీపీ పి. శేషులత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీడీవో ఎం. విశ్వనాథ్ మండలంలో అభివృద్ధిపై సమీక్షించారు. అనంతరం మహిళా దినోత్సవం సందర్భంగా కేక్ కట్‌చేసి మహిళా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్, ఏఈలు శ్రీనివాస్, రాజాశ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

బస్ కాంప్లెక్స్‌లో భోజనశాల ప్రారంభం

భీమవరంటౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ మహిళలకు రక్షణగా నిలబడాలని డీపీటీవో ఎన్‌వీఆర్ వరప్రసాద్ అన్నారు. ఆర్టీసి బస్ కాంప్లెక్స్‌లో మహిళా కండక్టర్ల కోసం ఏర్పాటుచేసిన భోజన శాలను ఆర్టీసి స్టాండింగ్ కౌన్సిల్ వై.స్వాతి ప్రారంభించగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని విధులలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులను ఎంపిక చేసి నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందించారు. ముఖ్యఅతిథులు న్యాయవాదులు చిత్ర భాను, వై.స్వాతిని సత్కరించారు. ఆర్టీసీ పర్సనల్ ఆఫీసర్ గీతావాణి, అకౌంట్స్ ఆఫీసర్ ఎస్.వి.రావు, డీపీటీవో ఉద్యోగులు, అసిస్టెంట్ మేనేజర్ సురేష్, ఎంఎఫ్ రవికుమార్, ఎ.ఎం.ఎఫ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం
మహిళల ఆందోళన

నరసాపురం రూరల్, మార్చి8(ఆంధ్రజ్యోతి): ఇళ్లు నిర్మించుకున్న ప్రభుత్వ కాలనీల్లో మౌలిక సదుపాయాలను కల్పించాలంటూ శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీతారాంపురంలోని కాలనీ వద్ద తాగునీరు రావడం లేదంటూ బిందెలు చేతబట్టి మహిళలు ఆందోళన చేశారు. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎస్ఎస్‌వీ గోపాలన్, కవురు పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో
భారీగా కేసుల పరిష్కారం

పాలకొల్లు టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోర్టు సముదాయంలో ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) షేక్ జియాద్దీన్ జాతీయ లోక్ అదాలత్‌ను శనివారం నిర్వహించారు. మొత్తం 176 కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. రూ.66,89,508 సొమ్మును బాధితులకు ఇప్పించినట్లు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్.వి.సూర్యనారాయణ, జె.వెంకటేశ్వరరావు, పి.బాలాజీ, యోహాను తదితరులు పాల్గొన్నారు.

తణుకు: కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 723 కేసులు రాజీ చేసినట్లు జిల్లా జడ్జి డి. సత్యవతి చెప్పారు. న్యాయమూర్తులు కె.కృష్ణ సత్యలత, తాడి ఆంజనేయులు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సూరంపూడి కామేష్, న్యాయవాదులు కౌరు వెంకటేశ్వర్లు, జయచంద్ర ప్రసాదు, మృత్యుంజయరావు, జస్పాల్ పాల్గొన్నారు.

నరసాపురం టౌన్: పట్టణంలోని కోర్టు ప్రాంగణంలో శనివారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో 310 కేసుల్ని పరిష్కరించినట్లు అదనపు న్యాయమూర్తి విజయదుర్గా తెలిపారు. న్యాయమూర్తులు ఆర్ వరలక్ష్మి, కె శ్రీనివాస్, కోర్టులైజన్ అధికారి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


సీఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న డిప్యూటీ స్పీకర్


పేదలకు అండగా కూటమి ప్రభుత్వం

ఆకివీడు రూరల్ మార్చి 8(ఆంధ్రజ్యోతి): పేదలకు కూటమి ప్రభుత్వం అండగా ఉందని డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు అన్నారు. అనారోగ్యంతో చికిత్స పొందిన, శస్త్రచికిత్సలు చేయించుకున్నవారికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఫిబ్రవరిలో ఆకివీడు మండలం నుంచి 10 మందికిగాను రూ.10.96 లక్షలు అందజేసినట్లు తెలిపారు. పార్టీ మండల అధ్యక్షకార్యదర్శులు మోటుపల్లి రామవరప్రసాదు, నౌకట్ల రామారావు, గొంట్లా గణపతి, బొల్లా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



గోపాలకృష్ణంరాజు సేవలు ఎనలేనివి

భీమవరం క్రైం, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): వైద్యరంగంలో డాక్టర్ గోపాలకృష్ణంరాజు సేవలు ఎనలేనివని పలువురు వక్తలు అన్నారు. భీమవరం టూటౌన్‌లో శనివారం జరిగిన డాక్టర్ గొట్టుముక్కల గోపాలకృష్ణంరాజు సంతాప సభకు పలువురు వైద్యులు, ప్రముఖులు విచ్చేసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీఎన్నార్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు గోకరాజు వెంకట నరసింహరాజు, గాదిరాజు సత్యనారాయణరాజు, వైద్యులు విశ్వనాథరాజు, పిఆర్‌కె వర్మ, కె.గోపాలరాజు, డాక్టర్ కెవిఎల్ రాజు, డాక్టర్ పేరిచర్ల దేవన్‌రాజు గోపాలకృష్ణంరాజు సేవలను కొనియాడారు. మంతెన రామ్‌కుమార్‌రాజు, పేరిచర్ల లక్ష్మణవర్మ, వేగేశ్న బంగార్రాజు, సీతారామరాజు, కలిదిండి భాస్కరరాజు, మంతెన వర్మ, భూపతిరాజు బుజ్జిరాజు పాల్గొన్నారు.



ఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలి

ఆచంట/నరసాపురం, మార్చి 8(ఆంధ్రజ్యోతి): పిఠాపురంలో ఈ నెల 14న జరిగే జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నరసాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ కోరారు. శనివారం ఆచంటలోని రామేశ్వరస్వామి సత్రంలో జరిగిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి జనసేన శ్రేణులు పెద్ద ఎత్తున పిఠాపురం తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆవిర్భావ దినోత్సవ పోస్టర్‌ను ఆవిష్క రించారు. నరసాపురంలో జరిగిన కార్యక్రమంలో విప్ నాయకర్‌తో పాటు కొత్తపల్లి సుబ్బారాయుడు ఆవిర్భావ దినోత్సవం విజయవంతం చేయాలని కోరారు.

రేపు యథాతథంగా
ప్రజా సమస్యల పరిష్కార వేదిక: ఆర్డీవో

నరసాపురం టౌన్, మార్చి 8 (ఆంధ్రజ్యోతి): సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఆర్డీవో దాసిరాజు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో నెల రోజులుగా ఈ కార్యక్రమం నిర్వహించలేదు. సోమవారం సబ్ డివిజన్ పరిధిల్లోని అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో పునఃప్రారంభిస్తామన్నారు. ఏమైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలని ఆర్డీవో కోరారు.

పెంటపాడు: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగే గ్రీవెన్స్ ఈ సోమవారం నుంచి యథావిధిగా జరుగుతుందని ఇన్‌చార్జి తహసీల్దార్ సీతారత్నం తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలు అర్జీలు దాఖలు చేయవచ్చన్నారు.

మానవత పౌష్టికాహారం వితరణ

భీమవరం క్రైం: మానవత భీమవరం శాఖ ప్రభుత్వాస్పత్రిలో హెచ్ఐవీ బాధిత కుటుంబాల పిల్లలకు పౌష్టికాహారం అందించింది. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ నాగరాజు ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ మానవత ప్రతి నెలా ఇలా పౌష్టికాహారం అందించడాన్ని అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షుడు పెన్మెత్స రామ్మోహన వర్మ మాట్లాడుతూ ఈ నెల సంస్థ సౌజన్యంతో 30 మందికి పౌష్టికాహారం అందించగా సభ్యులు కొత్తపల్లి కోదండ రామకృష్ణంరాజు సౌజన్యంతో భోజనం ప్యాకెట్లు 30 మంది పిల్లలకు అందించామన్నారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ అల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ పౌష్టికాహారంగా వంటనూనె, డ్రై ఫ్రూట్స్, పప్పు దినుసులు, మీల్‌మేకర్ తదితర పది రకాల సరుకులు పంపిణీ చేశామన్నారు.

'నా భర్తది ఆత్మహత్య కాదు.. హత్యే'

పెంటపాడు, మార్చి 8(ఆంధ్రజ్యోతి): తన భర్తది ఆత్మహత్య కాదని హత్యేనని పడమరవిప్పర్రు గ్రామానికి చందనాల ఉమాదేవి ఆరోపించారు. శనివారం తన నివాసం వద్ద నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి 2న తన భర్త పెద వెంకటేశ్వరరావు(50) మృతి చెందాడన్నారు. కొందరు కలసి చంపి తరువాత ఉరి వేసుకున్నట్లు చిత్రీకరించారన్నారు. తనకు న్యాయం చేయాలని తన కుమార్తెతో సహా సమావేశంలో కోరారు. దీనిపై ఎస్ఐ స్వామిని వివరణ కోరగా కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామన్నారు.